వెన్నుపోటుపై జనాగ్రహం

- గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం'
- నిరసన కార్యక్రమంలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్
- తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేత



కంకిపాడు డీటీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, ఇతర నాయకులు



గన్నవరం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

గన్నవరం: కూటమి ప్రభుత్వం ఏడాది దగాకోరు పాలనకు నిరసనగా బుధవారం చేపట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమానికి గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ శ్రేణులు కదంతొక్కారు.

గన్నవరంలో..

గన్నవరంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి నాలుగు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చారు. తొలుత స్థానిక బుద్ధవరం రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని నేతృత్వంలో ప్రదర్శన ప్రారంభమైంది. పార్టీ శ్రేణులు ప్లకార్డులు చేతపట్టుకుని కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలకు నిరసనగా పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ బుద్ధవరం బస్టాప్, గాంధీబొమ్మ చౌక్, మూడుబొమ్మ సెంటర్ మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు శాంతియుతంగా కొనసాగింది. రెవెన్యూ ఆఫీస్ ఎదుట బైఠయించిన పార్టీ శ్రేణులు ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని సీఎం, డెప్యూటీ సీఎం డౌన్.. డౌన్, జై వంశీ, జైజై జగన్ అంటూ పార్టీ శ్రేణులు నినదించాయి. అయితే గత సాధరణ ఎన్నికల అనంతరం వంశీమోహన్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టల నేపథ్యంలో పార్టీలో స్తబ్దత నెలకొంది. ఈ నేపథ్యంలో జరిగిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పోలీసుల నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా నిరసనకు తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులను పేర్ని నాని, పార్టీ జిల్లా పరిశీలకులు జెట్టి గురన్నాథం అభినందించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర నాయకులు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, గన్నవరం వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, పార్టీ మండల అధ్యక్షులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ నుంచి..

విజయవాడరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం గన్నవరంలో జరిగిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిన తీరును ప్రజలకు వివరిస్తూ నున్న, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు గ్రామాల నుంచి తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా అనేక పథకాలు అందుకున్న వారందరికీ మొదటి సంవత్సరమే వెన్నుపోటు పొడిచారని మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు శీలం రంగారావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యులు కె.సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి సమ్మెట సాంబయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, గ్రామపార్టీల కన్వీనర్లు పోలారెడ్డి చంద్రారెడ్డి, నల్లమోతు చంద్రశేఖర్, డీవీఆర్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

కంకిపాడు: వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కూటమి ఏడాది పాలనలో ప్రజావంచనను నిరసిస్తూ 'వెన్నుపోటు దినం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి కార్యక్రమం పట్టణంలోని అయానా ఫంక్షన్ హాలు నుంచి ప్రారంభమై ప్రదర్శన ప్రధాన రహదారి, గన్నవరం రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి దేవభక్తుని చక్రవర్తి ప్రసంగించారు. వెన్ను పోటు రాజకీయాలకు, కుట్రలకు నిలువుటద్దం చంద్రబాబు అండ్ పార్టీ అని ఎద్దేవా చేశారు. సీనియర్ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి వెన్నుపోటు పదానికి పేటెంట్ తెచ్చుకున్నారని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటుగా 134 పథకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కల్పన పేరుతో నిరుద్యోగులను వంచించారని, జీతాలు పెంచుతామని వలంటీర్లను, అధికారంలోకి వచ్చాక రేషన్‌పంపిణీ వాహనదారుల్ని రోడ్డుకు లాగటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్‌తో పాటుగా పవన్ కల్యాణ్‌తోనూ అబద్ధాలు చెప్పించారని విమర్శించారు. జగన్‌పై ఈగ వాలినా చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. నియోజకవర్గంలోని పలువురు ముఖ్యనేతలు కూటమి సర్కారు వైఫల్యాలను ఎండగట్టారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు నేతలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, మండల పార్టీ, మున్సిపాలిటీ అధ్యక్షుడు మాదు శ్రీహరి రాణి, దాసే రవి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, అబుకలాం, బాలకృష్ణ, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, రాష్ట్ర మహిళానేత రామినేని రమాదేవి, ముఖ్యనేతలు ప్రతివాడ రాఘవరావు, నత్తా వెంకటేశ్వరరావు, శీలం శ్రీరాములు, నక్కా శ్రీనివాసరావు, పాలడుగు శివజ్యోతి, తుమ్మూరు గంగారత్నం, నందిపాటి బిందుమాధవి, బందెల సుబ్బారావు, పిడికిటి రామకోటేశ్వరరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, భీమవరపు నాగిరెడ్డి, మండూరి కోటేశ్వరరావు, మాదు రాఘవేంద్రరావు, కలపాల వజ్రాలు, కొండవీటి సుబ్బారావు, మాగంటి శ్రీనివాసరావు, ఊర నాగిన్, పెనుమూడి సంజయ్, టెక్కెం సతీష్, కోనా కిషోర్, పిన్నబోయిన శ్రీనివాసరావు, తోకల ఉమాదేవి, మేదంద్రావు కుటుంబరావు, గోన మదన్, సంగెపు శ్రీనివాసరావు, సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, చిట్టూరి ప్రసాద్, రమావత్తు శ్రీకాంత్, తంబాబత్తుల ఓంకారం పాల్గొన్నారు.

కదం తొక్కిన పార్టీ శ్రేణులు, ప్రజలు

వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు కదంతొక్కారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలతో పాటుగా ఉయ్యూరు మున్సిపాలిటీ, తాడిగడప మున్సిపాలిటీల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా కాలినడకన ప్లకార్డులు ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వ పాలనను ఎండగట్టారు. అయితే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోకి ప్రజలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. గేట్లు మూసివేసి అధికార పక్షానికి వకాల్తాగా నిలిచారన్న విమర్శలు వినిపించాయి.

ప్రజాగ్రహానికి కొట్టుకుపోక తప్పదు

పేర్ని నాని, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

గన్నవరం: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది పాలనలో వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని విమర్శించారు. గన్నవరంలో 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమంలో పేర్ని నాని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలనే కాదు దేవుళ్లను కూడా కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఆలయ భూములను 99 ఏళ్ల అద్దె పేరుతో కూటమి నేతలకు పప్పుబెల్లంలా పంచిపెడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ఇక కూటమి ఎమ్మెల్యేలు అయితే బ్రాందీ వ్యాపారం, దందాలతో మునిగి తేలుతున్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో పంచిన ఇళ్ల పట్టాలు అప్పుడు సక్రమమే అన్న చంద్రబాబు ఇప్పుడు అక్రమమని వంశీని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడితే ఇప్పటి వరకు అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నాని ప్రశ్నించారు. గౌడ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపీపీలు చెన్ను ప్రసన్నకుమారి, వడ్లమూడి సరోజిని, యరగొర్ల నగేష్, జెడ్పీటీసీలు కాకర్లమూడి సువర్ణరాజు, అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జిల్లా నేతలు యార్కరెడ్డి నాగిరెడ్డి, ఆర్‌వీఆర్, మండల అధ్యక్షులు రంగారావు, నీలం ప్రవీణ్‌కుమార్, వింత శంకరరెడ్డి, నక్క గాంధీ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ అంటూ ఊదగొట్టారు



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ ఊదరగొట్టారు. ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తామంటూ నమ్మించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యింది. నేటికీ సూపర్‌సిక్స్‌కు మోక్షం లేదు. పథకాలు అమలు ఊసే లేదు. చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సూపర్ సిక్స్ అమలు చేయాలి.

– తొడుసు శ్రీను, పునాదిపాడు

రోడ్డున పడేశారు



జీతాలు పెంచుతామని వలంటీర్లను నమ్మించారు. తాజాగా రేషన్ వాహనాలను రద్దు చేసి ఇళ్ల వద్దకు రేషన్ పంపిణీకి మంగళం పాడారు. దీని వల్ల వేలాది మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఉపాధి, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అధికారంలోకి ఉన్న ఉపాధిని కూలదొయ్యటం ఎక్కడా చూడలేదు.

– తాళ్లూరి మరియబాబు, కంకిపాడు


ఒక్క పథకం అమలు చేయలేదు



కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేదు. ఎన్నికల సమయంలో బూటకపు వాగ్దానాలతో ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రజల్ని మరిచిపోయారు. ఏడాది గడిచినా ఒక్క పథకం అమలు కావటం లేదు.

– దేవరపల్లి సురేష్, కట్టుబడిపాలెం

అప్పులు చేయడమే సంపద సృష్టా?



రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో ఘోరంగా విఫలమైంది. విద్యార్థులకు, రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు. అన్ని వర్గాల ప్రజలు ఆశలు అడియాశలయ్యాయి. సంపద సృష్టి అంటూ ప్రచారం చేస్తూ అప్పులు చేస్తున్నారు.

– సమ్మెట సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి



గన్నవరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న పార్టీ నేతలు



వెన్నుపోటు దినం కార్యక్రమంలో రూరల్ పార్టీ నాయకులు



కంకిపాడులో ఆందోళనకు తరలివచ్చిన నియోజకవర్గ మహిళా నేతలు



కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం గేట్లు వేసిన దృశ్యం

క్లుప్తంగా

టౌన్‌ప్లానింగ్ అధికారుల రాకతో ఉద్రిక్తత

పెనమలూరు: యనమలకుదురులో అనధికార నిర్మాణంపై తాడిగడప టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవటానికి వెళ్లిన సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం గ్రామంలో అనధికారికంగా నిర్మిస్తున్న భవనం వద్దకు చేరుకోగా బిల్డర్ ఆయన మద్దతు దారులు నిరసనకు దిగారు. గ్రామంలో అనేక అక్రమ కట్టడాలు జరుగుతుంటే తన భవనంపైకే ఎందుకు వస్తున్నారని అధికారులను బిల్డర్ నిలదీశాడు. దీంతో అధికారులతో వాగ్వాదం జరిగింది. చివరకు అధికారులు స్వల్పంగా భవనాన్ని పగలకొట్టారు. ఇటీవల ఇదే భవనంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోగా, మరలా రెండవ సారి కూడా అధికారులు వచ్చి చర్యలు తీసుకోవటం చర్చనీయంగా మారింది. గతంలో చర్యలు తీసుకున్న పలు భవనాలను తిరిగి బిల్డర్లు నిర్మాణం చేశారు. వాటిపై మాత్రం టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు తెలిపారు.

కంకిపాడు చేరిన సైకిల్ యాత్రికుడు



కంకిపాడు: ప్లాంటేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధనకు సైకిల్ యాత్ర చేపట్టిన తమిళనాడు వాసి ముత్తు సెల్వన్ బుధవారం కంకిపాడు చేరుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ అధికారులు ముత్తుసెల్వన్‌కు ఘన స్వాగతం పలికి సత్కరించారు. 2021 డిసెంబరులో సైకిల్‌యాత్ర చేపట్టానని, 34,300 కిలోమీటర్లు యాత్రలో ఇప్పటి వరకూ 27,600 కిలోమీటర్లు యాత్ర పూర్తయ్యిందని ముత్తు సెల్వన్ వివరించారు. ఎంపీడీఓ పి.అనూష పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై ఆటో డ్రైవర్ దాడి

పెనమలూరు: కానూరులో వాచ్‌మెన్‌పై ఆటో డ్రైవర్ దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరులో గాయత్రి అపార్టుమెంట్‌లో తంగేటి రాంబాబు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతను తన కుమార్తెతో కలిసి మంగళవారం సాయంత్రం నాగార్జున ఆస్పత్రి దగ్గరలో ఉన్న వాటర్ ప్లాంట్‌కు వాటర్‌క్యాన్ తీసుకు వెళ్లటానికి వచ్చాడు. వాటర్ క్యాన్‌తో ఇంటికి వెళుతున్న సమయంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో ఆటో డ్రైవర్ వేగంగా ఆటోతో రాంబాబు మీదకు వచ్చాడు. దీంతో ఆటో నిర్లక్ష్యంగా ఎదుకు నడుపుతున్నావని ఆటో డ్రైవర్‌ను రాంబాబు ప్రశ్నించడంతో గొడవ జరిగింది. స్థానికులు విడిపించటంతో ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. కాగా రాత్రి సమయంలో ఆటో డ్రైవర్ ఇనుప రాడ్ తీసుకుని రాంబాబు పని చేస్తున్న అపార్టుమెంట్ వద్దకు వచ్చి దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పునీత అంతోని మహోత్సవాలు ప్రారంభం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం చర్చిలో పునీత అంతోని వారి మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత విజయవాడ మేత్రాసనం సోషస్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవ.ఫాదర్ తోట సునీల్ చేతుల మీదుగా అంతోని వారి జెండా అవిష్కరణ జరిపారు. అనంతరం నవదిన ప్రార్థనల్లో భాగంగా దివ్యబలి పూజను సమర్పించారు. సునీల్ మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రేమ, దయ, కరుణ వంటి సద్గుణాలతో పునీత అంతోని జీవించారని చెప్పారు. విచారణకర్తలు రెవ.ఫాదర్ నూతలపాటి కిషోర్, పలువురు సంఘ పెద్దలు, మరియమాత దళ సభ్యులు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

తల్లిపై దాడిచేసిన కుమారుడు, కోడలు అరెస్ట్

ఆత్కూరు(గన్నవరం): ఆస్తి వివాదం విషయమై తల్లిపై దాడిచేసిన కుమారుడు, కొడలిని బుధవారం ఆత్కూరు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన వడ్లమూడి విజయమ్మకు ఒక కుమారుడు, ఒక కుమార్తై సంతానం. అయితే మద్యం వ్యసనానికి బానిసైన కుమారుడు జోజి ఆస్తి కోసం తరుచూ తల్లితో గొడవపడుతున్నాడు. ఈ విషయమై విజయమ్మ ఇటీవల ఆత్కూరు పోలీసులను ఆశ్రయించి ఆస్తి కోసం వేధిస్తున్న కుమారుడికి కౌన్సెలింగ్ ఇవ్వమని కోరింది. దీంతో తల్లిపై కక్ష పెంచుకున్న జోజి, ఆతని భార్య సునీత విచక్షణ రహితంగా విజయమ్మపై దాడిచేసి కొట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి జోజి, సునీతను బుధవారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెనమలూరు: పోరంకి గ్రామంలోని లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో 21వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం 5 గంటలకు ఉప్రభాతసేవ, 9 గంటలకు స్వామివార్లకు పట్టు వస్త్రాలతో పెండ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణ, విష్వక్సేన పూజ, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు.

పెదపులిపాక ఇసుక క్వారీ తనిఖీ

క్వారీ ర్యాంపులకు గండ్లు కొట్టించిన అధికారులు

సాక్షి స్పందన

పెనమలూరు: పెదపులిపాక ఇసుక క్వారీని బుధవారం మండల అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతూ వాహనాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తుండం అధికారులు చూశారు. దీంతో చర్యలకు వెంటనే రంగంలోకి దిగారు. సాక్షి దిన పత్రికలో బుధవారం 'కృష్ణమ్మ గర్భంలో పచ్చగద్దలు ' వార్తపై అధికారులు ఎట్టకేలకు స్పందించి చర్యలు చేపట్టారు. పెదపులిపాక ఇసుక క్వారీ హైకోర్టు స్టేలో ఉంది. ఇక్కడ ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. అయితే పచ్చగద్దలు క్వారీని ఆక్రమించి అడ్డగోలుగా జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేసి అమ్ముకుంటూ ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. పట్టపగలే బహిరంగంగా పచ్చగద్దలు చెలరేగి పోతున్నా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు, పోలీసులు ఇంతకాలం మౌనంగా ఉన్నారు. పచ్చగద్దల అరాచకాలపై సాక్షిలో వార్త రావటంతో అధికారులు స్పందించారు.

ర్యాంపులకు గండి..

ఇసుక క్వారీకి ఉన్న రెండు ర్యాంపులకు తహసీల్దార్ గోపాలకృష్ణ, సీఐ వెంకటరమణ, సిబ్బంది జేసీబీతో గండి కొట్టించారు. అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక తవ్వకాలు చేయకుండా నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితిలో పెదపులిపాక క్వారీలో ఇసుక తవ్వకాలు చేయరాదన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై చర్యలు నిల్

కాగా అధికారులు పెదపులిపాక క్వారీని తనిఖీ చేసిన సమయంలో కృష్ణానదిలో అక్రమంగా ఇసుక తరలించటానికి పలు ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో నదిలో ఉన్నాయి. అయితే అధికారులు ట్రాక్టర్లను సీజ్ చేయలేదు. ట్రాక్టర్లలో ఇసుక నదిలోనే అన్‌లోడ్ చేయించి వదిలేశారు. ఈ చర్యల పట్ల స్థానికులకు పలు అనుమానాలు తలెత్తాయి. కోర్టు స్టేలో ఉన్న క్వారీలో ఇసుక అక్రమంగా తవ్వుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఇసుక దందాలో అధికారుల పాత్ర ఉందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ర్యాంపులకు గండి కొడుతున్న దృశ్యం



పెదపులిపాక క్వారీలో పట్టుబడిన ట్రాక్టర్లను వదిలేసిన అధికారులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కంకిపాడు: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం కంకిపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు పోటీలు నిర్వహించారు. క్యారమ్స్, యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు గ్రంథాలయాల్లో భగవద్గీత శ్లోక పఠనం, చిన్నారులకు క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను అభినందించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ఉయ్యూరు: స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. అనంతరం సాత్విక్ యోగా ట్రస్టు ఆధ్వర్యంలో యోగా గురువు కృష్ణ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. ఈ శిబిరంలో బుధవారం విద్యార్థులకు క్విజ్, పలు ఆటల పోటీలను నిర్వహించారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించడంతో పాటు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థి వారంలో ఒక రోజైన గ్రంథాలయాలను సందర్శించాలని కోరారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, విశ్రాంత వెటర్నరీఉద్యోగి ధర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: ఆటలు విద్యార్థులకు మనోవికాసాన్ని కలిగిస్తాయని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేశారు. మ్యూజిక్ చైర్స్, పుస్తక పఠనం, యోగా నిర్వహించారు. పాఠకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



కంకిపాడులో కథలు పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామవరప్పాడు: పర్యావరణ పరిరక్షణ మనందరి సామాజిక బాధ్యతని, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటానికి కృషి చేయాలని విజయ మహిళా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా విభాగం, ఏజీఎస్-ఐటీసీ- డబ్ల్యూఓడబ్ల్యూ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పద్మలత మాట్లాడుతూ మనం చేసే చిన్న చిన్న తప్పులు, పొరపాట్ల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రకృతి వనరులైన గాలి, నీరు, ఆకాశం రాను రానూ కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి కాటన్ సంచులు వాడాలని, మోటారు వాహనాలను వీలైనంత తగ్గించి సైకిల్ వినియోగించాలని సూచించారు. ఏజీఎస్, ఐటీసీ- డబ్ల్యూ ఓ డబ్ల్యూ ప్రతినిధి గణేష్ బాబు, జాతీయ సేవా విభాగం అధికారి ఏ జయరాం రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడరోడ్డులోని డివైడర్‌పై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని లారీ అదుపుతప్పి ఢీకొట్టడంతో నేలకు ఒరిగింది. బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పార్కింగ్ ప్రదేశంలోకి వెళ్లేందుకు లారీని వెనక్కి నడుపుతుండగా డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో నేలకు ఒరిగింది. అదృష్టవశాత్తూ ప్రమాద సమయంలో రహదారిపై వాహనాల రాకపోకలు, ప్రయాణికులు లేకపోవటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. రహదారికి అడ్డంగా విద్యుత్ స్తంభం పడిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో సంబంధిత అధికారులు క్రేన్ సాయంతో విద్యుత్ స్తంభాన్ని రహదారిపై నుంచి తొలగించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించడం బాధ్యత



ఉయ్యూరు: విద్యాప్రగతిలో భాగస్వాములై ప్రతిభావంతులకు ప్రోత్సాహం అందించటం సామాజిక బాధ్యత అని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ అన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో ప్రతిభ చాటిన ఉయ్యూరు విద్యార్థిని తుమ్మలచర్ల హారికకు ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల వాకర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘన సత్కారం నిర్వహించారు. రూ.20 వేల నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. సత్తార్ మాట్లాడుతూ కష్టించి విద్యనభ్యసించే విద్యావంతులకు వాకర్స్ అండగా ఉంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థిని హారిక ఇంటర్‌లో 989 మార్కులు సాధించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించటం ఉయ్యూరుకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, బాపిరాజు, ఊర నాగిన్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

- గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం మహిళాసంక్షేమం, శిశు అభివృద్ధి శాఖ జిల్లా పీడీ ఎం.ఎన్.రాణి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులను, పిల్లల హాజరును పరిశీలించారు.జరిగిన కిశోర వికాసం లో రాణి మాట్లాడారు. ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు సీహెచ్. నాగపద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.